

# చెదరిన కల

మోగంటి విజయలక్ష్మి

"ఏంటి మావ! ఇంకాపడుకొనే వున్నావు! పిట్టు బస్సు వచ్చే ఏళయింది! లేచి ఈయాలయిన అత్తమ్మకు ఆ డాక్టరోరు రాసిచ్చిన మందు బుడి కొను. నేకపోతే అత్తమ్మకు నీరసం తగ్గేలాలేదు! నిన్న తెత్తావనుకొంటే ఆ ఎలక్సనోళ్ళకూడా తిరిగేవు! అలా తిరిగితే నీకేటొచ్చింది. నిన్న బండితోల్లేదా ఏటి!"

"ఏటి? ఈ ఏల పొద్దున్నే అంకించుకొన్నావు. అయితే నేనీ రోజుబోనీ కొట్టినట్టే? ఏవే! ఈయేల యిలా తిరిగానో రేపు నేను, నువ్వుకూడా కాలుమీదకాలేసుకుని కూకోవచ్చు! ఆ రోజంటూ వస్తే నీ ఒళ్ళంతా బంగారంతో నింపేయనా రంగీ!"

"చాల్లేమావా! ఎన్నాళ్ళ నుంచో ఎదురింటి మల్లమ్మ కొన్నలాటి కమ్మలు కొంటానంటివేకాని కొనలేదు. నీకెంతొచ్చినా బాకెట్టుకె సరిపోదు. పరేగాని, నీవు స్టేండుకు పోగాని, నేను పొలానికి పోవాల యీ యేల పెదరాజుగారి చేనూడుత్తున్నారు. నిన్న మొన్న ఎల్లనేలేదు. అత్తమ్మ వంట్లో బాగునేదని! ఈ ఎల్లైనా ఎళ్ళి నాలుగు రూకలు తెచ్చుకొని కడుపునిండా కూడెట్టుకోవాల పిల్లలకి! నే ఎల్తున్నాగాని అత్తమ్మ మందు బుడ్డిమాత్రం మరిచిపోక? ఉట్టిమీద చద్దికూడు తిని మరీ ఎల్లు" అంటూ పనిలోకెళ్ళిపోయింది రంగి.

* * *

సాయంత్రం సంధ్య చీకట్లు అలుముకొంటుండగా పొలాన్నుండి వచ్చినరంగి నులక మంచం మీద ఎముకల పోగులా పడున్న అత్తమ్మ, మంచం చుట్టూ కూర్చొన్న తన ముగ్గురు పిల్లల్ని చూచి, అత్తమ్మను పలకరించి, పొయ్యిలో అగ్గి వేద్దామని వంట పంచాలో కెళ్ళింది. ఉట్టిమీద గిన్నె ఉట్టిమీదే వుంది!

అంటె! పొద్దున్న ఎల్లేప్పుడు మావ చద్దికూడు తిన్లేదన్నమాట!

ఈ మధ్య మావకి పేసన్లు వచ్చేసినాయి! మొన్న ఎలక్సన్లు అయినప్పటినుండీ మావకి రాజకీయాలు వంటబట్టినయ్!

"అలాటివన్నీ మనకెందుకులే మావా! కలవాళ్ళు ఎట్లా చేసినా పరవాలేదు, మన దగ్గర దిబ్బా? దిబ్బా! ఏ రోజు కారోజు కట్టపడి బతికే వాళ్ళం! నాలుగు డబ్బులు సంపాదించుకొని కడుపునిండా కూడు తింటే అదే సాలు!" అంటె -

"నీవూరుకోవే! నీకేం తెలుసు? ఈ ఏల లేనోళ్ళు రేపు డబ్బునోళ్ళు! రేపు అందరూ సమానమేనే పిచ్చి మొహమా, చెబితే మాత్రం నీకేం తెలుద్దిలే!" అనే మొగుడు నరసింహులు మాటలు తల్చుకుంటూ పొయ్యి దగ్గర కూకున్న రంగికి మనస్సంతా చికాకయిపోయింది. ఈ రోజన్నా రిక్షా తొక్కి అత్తమ్మకు మందుకొని తెస్తాడనుకొన్నరంగికి మావ జాడ లేదు.

రేపైనా ఊడ్చుకిచ్చిన డబ్బులెట్టి అత్తమ్మకు మందు కొనుక్కురావాలనుకొంది. అన్నం వార్చి, కోసుకొచ్చిన కూంత చింతచిగురు పప్పులో ఏసింది. పిల్లలు ముగ్గిరికి అన్నం పెట్టి ఆళ్ళని పండుకోబెట్టి, శెట్టి హోటలు కెళ్ళి పది పైసల కాఫీ తెచ్చి అత్తమ్మ కిచ్చిమావ కోసం ఎదురు చూస్తూకూకుంది రంగి. ఆలోచనలన్నీ మావ మీదే వున్నాయి. ఇదివరకటి మావకి ఇప్పటి మావకి తేడా చూసుకొంటోంది.

ఇది వరకయితే మావ రిక్షా తొక్కి అయిదు రూపాయలు తన చేతికిచ్చేవాడు రోజూ! అప్పుడప్పుడు తనూ, మావా పక్క వూరెల్లి సినిమాలు చూసేవాళ్ళు! తను, అత్తమ్మ ఊళ్ళో పనులు చేసి సంపాదించిన సొమ్మెట్టి గుడ్డలు కుట్టించుకొనేవారు. మావ తెచ్చిన డబ్బులో కూతో కొంతో తానుమిగిల్చేది ఇదివరకులా మావ రిక్షాతొక్కడం లేదు సరిగదా యిట్టంఅయితే తొక్కుతున్నాడు లేకపోతే అదీ లేదు! ఎలక్సన్లలో తిరిగి మావ పాడయి పోతాడని పరిపెట్టుకొంది. తొలి ఆట సినిమా వదిలాక వచ్చాడు నరసింహులు! పుల్‌గా తాగి వున్నాడు.

"కూడు తిందువుగాని రా మావా"

"నాకు వద్దే రంగీ! నే నమృతం తాగానే! నీ వింకా కూడు తినకుండా నా కోసం కూకున్నావా? నీవు తినేయ్!" అని మంచం మీద పడున్నాడు నరసింహులు. కళ్ళొత్తుకొంటూ రంగి గిన్నె కడుక్కుందేగాని ముద్ద మీద మనసు పోలేదు. గిన్నెలు తీసి ఉట్టెమీదెట్టి అత్త మంచం దగ్గర గోనె పరచి పడుకొంది.

* * *

కోడికూతేళ లేచి ఇల్లు గుమ్మాలు కడుక్కొని ముగ్గేసి, తప్పేళాలు తోముకుందా మనుకుంటున్న రంగికి మావ మంచందగ్గర యిప్పిన చొక్కా కనబడింది. జేబు తడిమిచూస్తే బాకెట్టు నెంబర్లు వేసిన కాగితం ముక్కలు, ఎలక్షన్ల బాపతు పేపర్లు తప్ప చిల్లి గవ్వకూడా లేదు. "అంటే మావ రిక్షా తొక్కిన డబ్బులు తాగడానికి, బాకెట్టుకు సరిపోయాయన్నమాట! ఈ మధ్య ప్రయాణాలు కూడా మానేసి పేసంగాలు వింటున్నాడు. అత్తమ్మ మంచంమీదపడ్డాక మావ ఆగడాలు మరీ ఎక్కువైపోనాయి! అత్తమ్మంటే మావకి నానా భయం!

అత్తమ్మకు నీరసం తగ్గి మళ్లీ మామూలు మనిషిలా తిరిగితేగాని మావ దార్లోకి రాడు!"

అత్తమ్మకు త్వరగా నయం కావాలని సింహాద్రి అప్పన్నని వేడుకొంది రంగి.

ఆవేళ చిన రాజుగారి పొలంనుంచి వత్తూ మరురోజు కూలి ఎడ్వాన్సుచ్చుకొని, అత్తమ్మకు బిళ్లంబుడ్డి కొంది రంగి. నాలుగు రోజులు ఆ మందు వాడినాక అప్పలనర్సుకి కొంచెం నీరసం తగ్గి ఇంట్లో అటూ, యిటూ తిరుగుతోంది.

సందకాడ తప్పతాగి వచ్చాడు నరసింహులు.

"ఏరా నరసింహులూ! కూడు ఎవడైనా రోజూ నీకు స్టాండులో పెడ్తున్నారేటిరా? సేపోతే ఆ ఎలచ్చనోళ్ళు కూడుకూడా పెడుతున్నారా? మరి ఏడున్నావురా ఇంటి ముఖం సూడకుండా యీ నాల్గురోజులూ?"

"ఏంటే? నీ పెప్పుడు లేచినావ్? ఈ మద్దె మువ్వసలు సుతక మంచం దిగడం లేదుగా? ఓలమ్మో! ఈ మాటు నువ్వు మంచమెక్కితే పెపేటు డాక్టరుకేనే సూపించేది! గవర్నమెంటు డాక్టరులకయితే మనం రిక్షావాళ్ళం, లేబరోళ్ళం అని అలానే! కొన్నాళ్ళుపోతే అణాగుద్ది యీళ్ళ పొగరుమోతుతనమంతా! ఈ వేల రేపు తిరుగు తానే! ఆ తరువాత రెండు పూట్లా కడుపునిండా కూడే! గంజి తాగి పొట్టనింపుకునే బతుకింక పోవాది! మనపాలిట ఇందిరమ్మ దేవతే అదేదో దేశంలాగ మనదేశం కూడా తయారయిందంటే అందరూ హాయిగా బతకొచ్చే! అదేనే సోషలిజం! మనంతాగా ఎలచ్చన్లలో పనిజేత్తేనేకదే ఇందిరమ్మ నెగ్గేది? ఆవిడ నెగ్గాలి! ఈ కలోళ్ళ పొగరణచాలి!" ఇలా తప్పతప్పగా వాగే నరసింహుల్ని చూసి అప్పలనరసు బాధపడిపోయింది. ఎవుడేనా దూర ప్రయాణాలకి రిక్షా ఏసికెడితేతప్ప తాగడం ఎరగడు. ఇక ఆడితో మాట్లాడితే లాభం లేదని ఊరుకుంచుకొని మంచం మీద కూలేసింది.

సోషలిజం గురించి, నాయకులు ఉపన్యాసాల్లో చెప్పగా పట్టుబడ్డ విషయాలగురించి నరసింహులు రాత్రంతా కలవరిస్తూనేవున్నాడు. ఆ సాయంత్రం రిక్షా అద్దె కట్టనేదని, నాలుగు రోజుల అద్దెకట్టి రిక్షా పట్టుకెళ్ళమని దాని యజమాని రిక్షాను స్టాండునుంచి మనిషిచేత ఇంటికి తీసికెళ్లిపోనాడని తెలుసుకొంది అప్పలనరసు కొడుకు నరసింహులు పలవరింతలవల్ల.


"ఈయేల నీ రిక్షా తొక్కే ఖర్మ పట్టిందిరా! రేపు నాకూ వొత్తాది కొత్త రిక్షా! రిక్షా ఏటి? అయిదు ఎకరాలే యిత్తారా గవర్నమెంటోళ్ళు! నీవెంతో నేనూ అంతేరా! మా కాంగ్రెసు అంటే ఏటనుకున్నాం ఇది మా ఇందిరమ్మ పభుత్వం రా. నేనసలు రిక్షాయే తొక్కను! నా రంగి ఊడుపుకే ఎల్లదు! ఎందుకెల్లాలి, నేనూ భూకామందునయిపోతాగా!" యిలా నరసింహులు వాడికున్న రాజకీయ పరిజ్ఞానంతో తెల్లవార్లు లెక్చర్లు కొడితూనే వున్నాడు.

సూరీడు నెత్తిమీద కొచ్చేవరకు సేవనేలేదు నరసింహులు. ఉన్న ఓపిక కాస్త కూడదీసుకొని మామూలుగా నేసితే సవడని చీపురుతో రెండిచ్చుకొంది నరసింహుల్ని అప్పలనరసు. దాంతో ఆడికి మైకం వదిలి "ఏందమ్మో! నేనేంచేస్తిని పొద్దున్నే నన్ను కొడుతున్నావ్!"

"కొట్టాలా? పీకపిసకాలా! తెల్లవార్లూ ఏటిరా నీవు వాగింది? నీ కెవడిత్తున్నాడ్రా ఐదెకరాలూ? రిచా అద్దె కట్టకుండా ఎదవ వేసాలు ఏత్తున్నావా? పెళ్ళాం బిడ్డలు అక్కర్నేదురా? అంసరూ అందలం ఎక్కితే మోసేదెవరురా? నాలుగురోజులు ఎలచ్చనులలో తిరిగినావో నేదో దానికింత పొగరుమోత్తనం వచ్చింది! సద్దికూడు నీకు చేదయిందా? అయిదెకరాలు ఇత్తె నీవేటి చేత్తవురా? పదిరోజులు తాగుతావు! బాకెట్టు కడతావు? ఆ తరువాత ఏటిరా నువ్వు సేసేది? చేతిలో సిల్లిగవ్వ నేదుగని యవసాయం ఎట్లా చేత్తావురా? రిక్షా తొక్కి డబ్బులు తెత్తేగని కుర్రాళ్ళకు కూడు నేదుగాని కబుర్లు మాత్రం కోటలు దాటిత్తున్నావ్! గవర్నమెంటోళ్ళు మనలాటి వాళ్ళకు భూమిచ్చి మనల్ని ఎందుకూ పనికిరాని వాళ్ళని చేత్తురా! కాయకట్టం చేత్తే ఎట్టాగన్నా బతకొచ్చు! పొలమివ్వాగానే మనం పెదబాబులైపోం రా! పని చేస్తేనే పొట్ట నిండేది, మనలాటి వాళ్ళకిలాంటి ఆశలు సూపించి మన మాదే తోలుబొమ్మలాటలు చూసి సంతోసిత్తారురా పెద్దోళ్ళు! నువ్వు యిలా ఎలచ్చన్లలో తిరిగి, పిల్లలని పస్తులు పడుకోబెడితే నేను, నువ్యో గొయ్యో సూసుకొంటానంతే! ఎల్లి మొగం కడుక్కొని చద్దికూడు తిను! ఆ దాబింటి కెళ్దాం! నే నిదివరకు ఆరికి పనిచేసిన అభిమానం చొప్పునేనా రిక్షా యిత్తారు! నాలుగు రోజులు తొక్కి ఆ డబ్బు కట్టేద్దువుగాని" అని అప్పలనరసు కొడుకుని తిట్టి ఆయాసంతో నులకమంచం మీద కూలబడింది.

తల్లి చెప్పిన మాటలలోని మంచిని, ఎలచ్చన్లలో నాయకుల చెప్పిన మాటలనే బేరీజు వేసుకొంటూ తండ్రినే సూడని నరసింహులు కని పెంచిన తల్లి మాటలకు తలవంచి సద్దికూడు గిన్నె దగ్గిరకూకున్నాడు. రంగి కళ్ళు అత్తమ్మ కేసి సంతోషంగా చూసాయి.

★



నాణ్యతకు, మన్నికకు 'శుమింద్' బ్రాండ్
ఇడ్లీ స్టాండ్లు, ఇడ్లీ పాట్సు, మిల్కు-కుక్కర్లనే
వాడండి.
వంటయింటి శోభకు 'శుమింద్' వంట సామాగ్రులు.
అన్ని స్టెయిన్‌లెస్ స్టీలు షాపులలోనూ,
సూపరు బజార్లలోనూ లభించును.
తయారు చేయువారు:
శుభోదయ మెటల్ ఇండస్ట్రీస్
భీమవరం (A.P.)